జీపీల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం

రాంనగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ(జీపీ)ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సందీల బలరామ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఫోరం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంవత్సరన్నర కాలం నుంచి గ్రామాల్లో సర్పంచులు లేకపోయినా పంచాయతీ కార్యదర్శులు అన్నీ తానై నడిపిస్తున్నారన్నారు. దీంతో సంక్షేమ పథకాల అమలు భారం కార్యదర్శులపై పడిందన్నారు. సంవత్సర కాలం నుంచి గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఎలాంటి నిధులూ విడుదల చేయలేదున్నారు. వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రి, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో పారిశుధ్య నిర్వహణపై సమావేశాలు నిర్వహించి, చెత్త సేకరణ కోసం కొత్త యాప్ తీసుకువస్తారని తెలిపారు. ప్రస్తుతం గ్రామాలలో చెత్తను సేకరించే ట్రాక్టర్ నడపడానికి డీజిల్‌కు కూడా డబ్బులు లేవని, ఈ కొత్త యాప్ ఎలా సాధ్యమవుతుందన్నారు.

నటుడు బాలకృష్ణకు పద్మభూషణ్ రావడంపై హర్షం

చిక్కడపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు, హిందుపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రాష్ట్రపతి చేతులమీదుగా సోమవారం పద్మభూషణ్ అవార్డు అందుకున్న సందర్భంగా టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జంగం దశరథ్ హర్షం ప్రకటించారు. తెలుగుదనాన్ని ప్రస్ఫుటింపచేస్తూ పంచెకట్టులో ఈ అవార్డును ఆయన అందుకున్నారని తెలిపారరు. సంఘసేవకుడిగా బాలకృష్ణ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని తాము కూడా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నానని తెలిపారు.

రోడ్డుపై గుంతలు పూడ్చాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ గాంధీనగర్ విజయబ్యాంక్ లేన్‌లో రోడ్డుపై గుంతలను పూడ్చివేయాలని తెలంగాణ జనసమితి ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. రోడ్డుపై ఎక్కడ చూసినా గుంతలు ఉన్నాయని దీంతో రాత్రిపూట వాహనచోదకులు గుంతల్లో పడిపోయి గాయాలపాలవుతున్నారని అన్నారు. వర్షం వచ్చిందంటే గుంతలు కనపడకపోవడంతో చీకట్లో వాహనచోదకులు అందులో పడిపోతున్నారన్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు స్పందించి గుంతలకు ప్యాచ్‌వర్క్ చేయాలని శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు.

'రాష్ట్ర అభివృద్ధి ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే'

చిక్కడపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల చిరకాల కోరిక ప్రత్యేకరాష్ట్రం సాధించడంతోపాటు రాష్ట్రాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివిధాలుగా అభివృద్ధి చేసిందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం వరంగల్ ఎల్కతుర్తిలో జరిగిన పార్టీ రజతోత్సవ వేడుకలకు ముషీరాబాద్ నుంచి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం అని సీఎం కేసీఆర్ చేసి చూపించారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, డివిజన్ పార్టీ అధ్యక్షుడు ముడారపు రాకేష్‌కుమార్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, పున్న సత్యనారాయణ, రవిశంకర్‌గుప్తా, దేవయ్య, ఎస్టీ ప్రేమ్, బన్ని, వెంకటేశ్, స్వరూప, అరుణశ్రీ, వనజ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభలో కేసీఆర్ రెండు నాల్కల ధోరణి : టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న పి.సాయిబాబా

రాంనగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ చంద్రబాబుపై విమర్శలు చేయడం ఆయన రెండు నాల్కల ధోరణికి నిదర్శనం అని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా ఆరోపించారు. వరంగల్ రజతోత్సవ సభలో ఆనాడు చంద్రబాబు తెలంగాణ అనే పదం నిషేధించారని కేసీఆర్ పేర్కొన్నారని టీడీపీని ప్రత్యక్షంగా ఎదుర్కొనే దమ్ములేకనే విమర్శలు చేశారని ఆరోపించారు. మంగళవారం టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ చేసిన దౌర్భాగ్యమైన పనుల వల్లనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హిందీ, తెలుగు పాటల మధురగానం



గానం చేస్తున్న గాయనీగాయకులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జీఎస్ఆర్ అండ్ ఫ్రెండ్స్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయ గానసభలో పిల్లలూ దేవుడూ చల్లనివారే శీర్షికతో తెలుగు హిందీ చిత్రాలలోని గీతాలు గాయనీగాయకులు మధురంగా ఆలపించారు. రుక్మిణి, సత్యవతి, త్రినాథరావు, దివ్య, కార్తీక, పద్మజ, అరుణ, రామమూర్తి, రామకృష్ణ తదితరులు పలు పాటలను ఆలపించారు. సభా కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు జీఎస్ఆర్ స్వాగతం పలుకుతూ తమ సంస్థ తొలి వార్షిక వేడుకల సందర్భంగా గట్టుపలి చెంచురామారావు స్మారక సంగీత నగదు పురస్కారాలు గోళ్లమూడి శ్రీప్రియ, గోళ్లమూడి శ్రీవల్లీకి అందజేస్తున్నామని తెలిపారు. త్రినాథరావు పురస్కారాలు బహూకరించారు.

ఘనంగా తెలంగాణ జన సమితి ఆవిర్భావ వేడుకలు

రాంనగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జన సమితి ఆవిర్భావ వేడుకలు మంగళవారం ముషీరాబాద్ నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. టీజేఎస్ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు కాకునూరి సుధాకర్ ఆధ్వర్యంలో రాంనగర్ గుండూ వద్ద పార్టీ జెండాను గ్రేటర్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలకు ఇచ్చిన తెలంగాణ ఆకాంక్షలను నెరవేర్చడానికి అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ నాయకులు మెరుగు శ్రీనివాస్‌యాదవ్, జస్వంత్‌కుమార్, జయపాల్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, నవీన్ పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాగ్‌లింగంపల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న చెత్తకు నిప్పు అంటుకుని మంటలు ఎగిసిపడి ట్రాన్స్‌ఫార్మర్‌కు అంటుకున్నాయి. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌లింగంపల్లిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్త పేరుకుపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు అంటించారు. ఈ మంటలు ట్రాన్స్‌ఫారంకు అంటుకున్నాయి. దీంతో స్థానికులు సమాచారం అందించడంతో ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది.

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలి


ఎస్ఐ అబ్దుల్ గఫార్‌ను సత్కరిస్తున్న ఏసీపీ సంపత్‌కుమార్

బర్కత్‌పుర, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని ట్రాఫిక్ ఏసీపీ సంపత్ కుమార్ అన్నారు. నిస్వార్థంగా సేవలందిస్తేనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. మంగళవారం కాచిగూడ ట్రాఫిక్ పీఎస్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన అబ్దుల్ గఫార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కాచిగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, ఏఎస్ఐ అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

రాహుల్ పోరాటానికి మద్దతు ఇవ్వాలి

బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో మంత్రి ప్రభాకర్, మాజీ ఎంపీ వీహెచ్, ఏఐసీసీ ఇన్‌చార్జి విశ్వనాథన్, ఎమ్మెల్యే శ్రీగణేష్, ఎమ్మెల్సీ బలరామ్ నాయక్, మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల హక్కుల పరిరక్షణ కోసం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి దేశ ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. అంబర్‌పేట శ్రీరమణచౌరస్తాలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్. బీఆర్.అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ మంగళవారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పొన్నం ప్రభాకర్ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ అన్నివర్గాలకు సామాజిక న్యాయం కలిగే విధంగా అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని రూపొందించారని అన్నారు. అయితే మనువాదులు తమ రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ చేస్తున్న కుట్రల నుంచి భారత రాజ్యాంగాన్ని కాపాడేందుకు రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారని అన్నారు. జ్యోతిరావు పూలే-అంబేడ్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు కొనసాగిస్తున్నాయన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్లను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తోందన్నారు. దీనిని కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. బీసీలకు విద్య, ఉద్యోగ రంగాలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత రాహుల్‌గాంధీదే అన్నారు.

ఇక్కడ అంబేడక్కర్ విగ్రహం ఏర్పాటును గత బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకోవడంతో పాటు 18 మందిపై అక్రమ కేసులు బనాయించిందన్నారు. బీసీల హక్కులను కాపాడేందుకు వీహెచ్ చేస్తున్న పోరాటం గొప్పదన్నారు. పార్టీ జాతీయ నాయకత్వం వీహెచ్ సేవలను తప్పకుండా గుర్తిస్తుందన్నారు. ఏఐసీసీ ఇన్‌చార్జి విశ్వనాథన్ మాట్లాడుతూ గాంధీ కుటుంబానికి వీహెచ్ నమ్మినబంటని, ఆయన ఎన్నో పదవులు నిర్వహించి న్యాయం చేసిన సామాజిక నాయకుడని అన్నారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ పూలే - అంబేడ్కర్ ఆశయాలను కాంగ్రెస్ ఒక్కటే కాపాడుతోందన్నారు. పంజాగుట్టలో మొదలైన అంబేడ్కర్ విగ్రహ పోరాటంలో తనతోపాటు మరికొంత నేతలపై బీఆర్ఎస్ పార్టీకేసులు పెట్టి బనాయించిందని ఆరోపించారు. త్వరలో గౌతులచ్చన్న ఆడిటోరియంలో ఏర్పాటుచేస్తామని మంత్రి తెలిపారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, కేరళ ఎమ్మెల్యే విష్ణునాథన్ మాట్లాడుతూ వీహెచ్ తెలంగాణ అభినవపూలే అని అభివర్ణించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బలరామ్ నాయక్, మాజీ ఎమ్మెల్యేలు చాడ జనార్దన్‌రెడ్డి, కమలాకర్, జాజుల శ్రీనివాస్‌గౌడ్, బి.బాల్‌రాజ్ గౌడ్, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు పుల్లా నారాయణ స్వామి, జగన్, శంభుల ఉషశ్రీ, రామ్మోహన్, ఆర్.లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

- న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి
- ఇందిరా పార్కు వద్ద భారీ ధర్నాలో పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు


పెన్షనర్ల ధర్నాలో అభివాదం చేస్తున్న వివిధ పార్టీలు, యూనియన్‌ల నేతలు

కవాడిగూడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులు పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఉద్యమం చేయాలని పలువురునేతలు పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్నపెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆల్‌పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు రాష్ట్ర అధ్యక్షుడు పోతుల నారాయణరెడ్డి అధ్యక్షత వహించగా ప్రధానకార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి సంధానకర్తగా వ్యవహరించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను అనేక మార్లు శాసనమండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. ఉద్యోగ జేఏసీ నాయకులు ఏలూరి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ, రాష్ట్రంలో 27 డిపార్టమెంట్ల సమస్యల పరిష్కారానికి డిపార్టమెంట్ వారీగా డిమాండ్లను సమాధానం ఇవ్వమంటే ఇప్పటికీ 9 డిపార్ట్‌మెంటులు నోటు పంపించాయన్నారు. సీఐటీయూనాయకుడు వీఎస్‌రావు మాట్లాడుతూ, ప్రభుత్వాలు, ఉద్యోగులుపెన్షనర్ల, కార్మికుల సంక్షేమం కోసం పనిచేయడం లేదన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు పోతుల నారాయణరెడ్డి మాట్లాడుతూ, మార్చి 2024 తదుపరి రిటైర్డ్ అయిన వారికి సంవత్సరకాలం గడుస్తున్నా పెన్షన్ బెనిఫిట్లు చెల్లించలేదన్నారు. బకాయిలను, బెనిఫిట్లను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో నాయకులు ఎంఎన్‌రెడ్డి, యు ఆంజనేయులు, అసోసియేషన్ ప్రధానకార్యదర్శి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు నరహరి, కమల కుమారి, సీతారం, ప్రభాకర్ నాయకర్, అశోక్, రంగయ్య, నాగేశ్వర్‌రావు, స్వరాజ్‌కుమార్, బ్రహ్మయ్య, జనార్దన్, నర్సింగ్‌రావు, జనార్దన్, రామారావు, రమేష్, రాధాకృష్ణ, కృష్ణ మోహన్, శ్యాంసుందర్, పెన్షనర్లు పాల్గొన్నారు.



ఆహారం, ఆధ్యాత్మికత సంచికను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఘనంగా ఐహెచ్ఎం వార్షిక అవార్డుల వేడుక

రాంనగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ 2024 - 25 విద్యా సంవత్సరానికి వార్షిక అవార్డు వేడుకలను మంగళవారం విద్యానగర్‌లోని డీడీ కాలనీలోని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పర్యాటక శాఖకు చెందిన ఈ ఇనిస్టిట్యూట్‌లో వేడుకలకు ముందు పహెల్గామ్ దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించి, రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆహారం, ఆధ్యాత్మికత అనే అంశంపై రూపొందించిన సంచికను ఆవిష్కరించారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా ఇస్కాన్ ఆధ్యాత్మిక గురువు ప్రద్యుమ్న కృష్ణదాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత జీవితంలో సమతుల్యతను పాటించాలన్నారు. ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ సంజయ్‌ఠాకూర్ మాట్లాడుతూ ఆతిథ్య రంగంలో భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దడానికి నిబద్ధతతో పనిచేస్తున్నామన్నారు. ఉస్మానియా మెడికల్ కాలేజ్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు మాట్లాడుతూ ఈ ఇనిస్టిట్యూట్ తన కుమారుడి జీవితాన్ని ఎంతగానో మార్చిందన్నారు. హెచ్ఆర్ఏటీఎస్ అధ్యక్షుడు పంకజ్ సంపత్, ఐటీసీ కాకతీయ జనరల్ మేనేజర్ అభిషేక్ మీనన్, అమృత, పి.చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించి స్పోర్ట్స్ మీట్‌లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. పోటీల్లో ప్రొఫెషనల్ కేటగిరిలో పాల్గొన్న దాల్ఫిన్ హోటల్ విజేతగా నిలిచింది.


అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, కృష్ణమోహన్‌రావు, సత్యం తదితరులు

42 శాతం బీసీ రిజర్వేషన్ల జీవో జారీచేయాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బీసీ 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జీవో జారీచేయాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. జీవో లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, ఆమరణ దీక్షలు చేపడతామని ఆయన హెచ్చరించారు. మంగళవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో 42 శాతం తెలంగాణ బీసీ రిజర్వేషన్ల బిల్లు - భవిష్యత్ కార్యాచరణపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ఇటీవల రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారని, దానిలో బీసీ రిజర్వేషన్ల ప్రస్తావన లేదని ఆరోపించారు. బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నీల వెంకటేష్, సి.రాజేందర్, జి.మల్లేష్‌యాదవ్, రాపోలు జ్ఞానేశ్వర్, జె.నరేందర్, బాలయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి మృతులకు నివాళి


మృతులకు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పావని తదితరులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): భారత భూభాగంలో భూతల స్వర్గంగా పేరుగాంచిన కశ్మీర్‌లోని పహల్గాంలోకి ఉగ్రదాడికి నిరసనగా బీజేవైఎం గాంధీనగర్ డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఆంధ్రాకేఫ్ చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. తమ ప్రాణాలను పోగొట్టుకున్న హిందూ వీరులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ దాడిలో మృతి చెందినవారికి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, సీనియర్ నాయకులు తదితరులు అమరవీరులకు నివాళులు అర్పించారు.

ఇంటర్ ఫలితాల్లో న్యూఎరా విజయకేతనం


ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఫలితాల్లో సత్తా చాటిన న్యూఎరా కాలేజీ విద్యార్థుల బృందం

రాంనగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఫలితాల్లో న్యూఎరా జూనియర్ కాలేజీ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సన్మాన కార్యక్రమాన్ని మంగళవారం చిక్కడపల్లిలోని కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి యేడాది ఉత్తమ ఫలితాలు సాధించేలా, ఉత్తమంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే తమ కళాశాల లక్ష్యమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విలువలతో కూడిన విద్యను అందిస్తూ లక్షల మందితో కూడిన విద్యా సంస్థలకు దీటుగా విజయపథంలో ముందుకు సాగుతోందన్నారు.

ఘనంగా పరుశురామ్ జయంతి వేడుకలు

నల్లకుంట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు ఆధ్వర్యంలో పరశురామ్ జయంతిని మంగళవారం నల్లకుంటలోని సమితి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పరుశురామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవులపల్లి రంగారావు, మంత్రి సునీల్, దేవులపల్లి అశోక్‌కుమార్, రాఘవేంద్ర, గూడ జయరాం తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి ప్రైవేట్ ఉద్యోగి ఆత్మహత్య

బర్కత్‌పుర, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై ఓ ప్రైవేట్ ఉద్యోగి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... మైలార్‌దేవులపల్లి ఉద్దంగడ్డలో నివాసం ఉంటున్న హనుమంతు కుమారుడు పృథ్వీరాజ్(21) ప్రైవేట్ ఉద్యోగి. సోమవారం రాత్రి శివరాంపల్లి- బుద్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమ విఫలమై ఈ ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


యూనివర్సిటీల కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు

ప్రతి యూనివర్సిటీకి వెయ్యి కోట్లు కేటాయించాలి

నల్లకుంట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో యూనివర్సిటీల సమస్యల పరిష్కారం కోసం ప్రతి యూనివర్సిటీకి వెయ్యి కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వి.శ్రీకాంత్, పి.నాగరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని కార్యాలయంలో పీడీఎస్‌యూ యూనివర్సిటీల ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించినట్లు ప్రతి జిల్లాకు యూనివర్సిటీని ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేట్ యూనివర్సిటీలో ఫీజులను నియంత్రించాలని, అన్ని యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఓయూలో విడుదల చేసిన నియంతృత్వ సర్క్యులర్లను వెనక్కి తీసుకోవాలని, హెచ్‌సీయూ మొత్తం భూములను యూనివర్సిటీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ యూనివర్సిటీల కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్‌గా పి.మహేష్, సభ్యులుగా మంద నవీన్, ఎస్.కె.ఆసిఫ్, సంతోష్(ఓయూ), ఆరిజ్ఞ(హెచ్‌సీయూ)తో పాటు మిగతా 13 మందితో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పరమవీరచక్ర పుస్తకంలో మహనీయుల త్యాగాల ఆవిష్కరణ


రచయిత వనకళ వీరప్పను సత్కరిస్తున్న కేపీ.మురళీకృష్ణ తదితరులు

నల్లకుంట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నాటి మహనీయుల త్యాగాలను రచయిత వనకళ వీరప్ప పరమవీరచక్ర పుస్తకంలో ఆవిష్కరింపచేసిన తీరు అభినందనీయమని తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ.మురళీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం నల్లకుంట డివిజన్ రత్నానగర్ జాగృతి సంస్థ కార్యాలయంలో రచయిత వనకళ వీరప్పకు శాలువాకప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రత్నానగర్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు ఎంటీ.కిషోర్‌కుమార్, మాజీ అధ్యక్షుడు పి.ఈశ్వర్, ఉపాధ్యక్షుడు పింజరి నర్సింగ్‌రావు, శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఆర్.నర్సింగ్‌రావు, అధ్యక్షుడు పోచల్ ప్రసాద్, నాయకులు సతీష్‌చంద్రగౌడ్, వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

నల్లకుంట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అక్షరాస్యతను పెంపొందించేందుకు తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సెయింట్ మేరీ హైస్కూల్ కరస్పాండెంట్ వై.వెంకటరెడ్డి కోరారు. నల్లకుంట డివిజన్‌లోని న్యూనల్లకుంట లింగాలగడ్డ వద్ద గల సెయింట్ మేరీ ప్రీ ప్రైమరీ, నర్సరీ, ఎల్‌కేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా వై.వెంకటరెడ్డి విద్యార్థులకు జనపనార సంచుల(బ్యాగులు)ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.స్వరూప, తబుసం, భారతి, సరిత తదితరులు పాల్గొన్నారు.

అచ్యుత్‌రెడ్డి మార్గ్‌లో మజ్జిగ పంపిణీ



బీజేపీ నాయకులు కె.సురేందర్ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని అచ్యుత్‌రెడ్డి మార్గ్‌లో మంగళవారం మజ్జిగ పంపిణీని బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆర్.శేషసాయి, గౌరీశంకర్, నరేష్, ప్రదీప్, చంద్రశేఖర్, బాల్‌రాజ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

ఘనంగా సకల కళల నృత్య సమ్మేళనం

రాంనగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సకల కళల నృత్య సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో 56 డ్యాన్స్ అకాడమీల నుంచి 430 మంది నృత్య కళాకారులు పాల్గొని నృత్యప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ హాజరై మాట్లాడారు. నృత్యం, నృత్తం రెండు వేర్వేరు కళలని నృత్యం అంటే సకల కళలను అభినయిస్తూ చేయడం అని పేర్కొన్నారు. నృత్యం చేయడం అంటే ఒక కథను చెప్పడమన్నారు. ఈ సందర్భంగా కళాకారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఇందిరా పరుశరామ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డ్యాన్స్ అండ్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ సువర్ణలత, గురువులు రమణి, ఓలేటి పార్వతీశం, ఓలేటి రంగమణి, సంజయ్‌కుమార్, హెచ్‌యూజే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, రిటైర్డ్ జడ్జి మాల్యాద్రి, బాలోత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శి భూపతి వెంకటేశ్వర్లు, సోమయ్య, రూపరుక్మిణి, రచయిత మమత, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

